క్లుప్తంగా

కందిపంట పరిశీలన



పాపిరెడ్డిపల్లిలో కంది పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

వెలిగండ్ల: కందిలో వైరస్ తెగులు వ్యాపిస్తుందని ముందస్తు చర్యలు చేపట్టాలని ఏడీఏ ఈ వెంకటరమణ అన్నారు. మండలంలోని పాపిరెడ్డిపల్లిలో రైతులు సాగు చేసిన కందిపంటను ఏడీఏ వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కందిపంటలో వైరస్ తెగులు నల్లి ద్వారా వ్యాపిస్తుందన్నారు. వైరస్ తెగులు నివారణకు నీమ్ ఆయిల్ వ్యవసాయాధికారి సూచించిన విధంగా పిచికారీ చేయాలన్నారు. వైరస్ తెగులు పూర్తిగా సోకిన మొక్కలు ఎక్కువగా కనిపిస్తే వాటిని పెరికివేయాలన్నారు. ఈ-పంట ఈనెల 15 వ తేదీ లోగా చేసుకోవాలన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ



పరీక్షా సామాగ్రితో విద్యార్థులు

పీసీపల్లి: విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని హెచ్ఎం అంజనీదేవి అన్నారు. మండల పరిధిలోని నేరేడుపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం దాతలు పరీక్షా సామాగ్రి అందజేశారు. మర్రిపూడి విశ్రాంతి ఎంఈఓ ద్వారశీల ప్రసాదొరెడ్డి, కుమారుడు చక్రధర్‌రెడ్డి, సోదరుడు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు సమ్మెటీవ్ -1 పరీక్షల సందర్భంగా 30 మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేశారు.

ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళి

మర్రిపూడి: విద్యార్థుల అభ్యున్నతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమని కనిగిరి ఉపవిద్యాశాఖాధికారి ఏ చంద్రమౌళి అన్నారు. మండలంలోని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్నీ తరగతులు తిరిగి విద్యార్థుల నోట్స్‌లను తనిఖీ చేసి పదో తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్, డైరీలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు బీడీ కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఐలమ్మకు ఘన నివాళి



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం అనే నినాదంతో రజాకారులను ఎదురించిన గొప్ప వీర వనిత చిట్యాల ఐలమ్మ అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. బీసీ ఐక్యవేదిక కార్యాలయంలో మంగళవారం చిట్యాల ఐలమ్మ వర్ధంతిని వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. బీసీ సంఘ నాయకులు పల్లా మాలకొండ్రావు, బొప్పరాజు సుబ్బారావు, ఎస్‌కే బారాహిమామ్, చింతలపూడి తిరుపాలు, పట్నం నరసింహం, వాసు, విజయ రామరాజు, చిన కాశయ్య, పండు, కేవీ, పొట్టేళ్ల మాలకొండయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలుంటే జాగ్రత్త

వలేటివారిపాలెం: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగితే సహించేది లేదని ఏపీడీఓ బాబురావు హెచ్చరించారు. మండలంలోని నలదలపూరులో జరుగుతున్న పనులను మంగళవారం ఏపీడీఓ పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. అధికారులు ఇచ్చిన కొలతలు ప్రకారమే పని చేయాలన్నారు. ఒకరు బదులు ఒకరు వచ్చిన, దొంగ మస్టర్లు వేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే రికవరీ చేస్తామని హెచ్చరించారు. వలేటివారిపాలెం మండలంలో కొన్ని చోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు బంధు ప్రీతి, రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకొని కొంత మందికి ఎక్కువగా కూలి ఇవ్వడం, కొంత మందికి తక్కువ ఇవ్వడం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయని అలా జరిగితే ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. జాబ్ కార్డు లేని వారికి దరఖాస్తు చేయించి జాబ్ కార్డులు కల్పించాలని సూచించారు.

ప్రతిభకు ప్రోత్సాహం..!

- పేద విద్యార్థులకు వరం ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్
- ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఎంతో ప్రోత్సాహం
- దరఖాస్తు గడువు 17 వ తేదీ వరకు పొడిగింపు



పరీక్షలకు సిద్ధమవుతున్న 8వ తరగతి విద్యార్థులు

కనిగిరి రూరల్:

ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌ను ప్రవేశపెట్టింది. ఈ స్కాలర్‌షిప్‌కు 2024-25వ విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దరఖాస్తుల ప్రక్రియ ఆగస్టు 5వ తేదీన ప్రారంభం కాగా ఈ నెల 17వ తేదీ వరకు అవకాశాన్ని కల్పిస్తు చివరి తేదీని పొడిగించినట్లు అధికారులు ప్రకటించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్న పాఠశాలల్లోని 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకుని, రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తులను సమర్పించాల్సి ఉంది.

ఏడాది రూ.12 వేల ఉపకార వేతనం

కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నెలకు రూ.1000 చెప్పన ఏడాదికి రూ.12,000 ఆర్థికసాయం అందిస్తారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్ల పాటు ఈ స్కాలర్‌షిప్ అందుతుంది. నగదును ఏడా విద్యార్థి ఖాతాల్లో జమ చేస్తారు. చదువుకోవాలని ఆశ ఉండి పేదరికం, ఆర్థికపరమైన ఇబ్బందులు ఉండి విద్యకు దూరమైన విద్యార్థులకు ఈ ఆర్థికసాయం ఎంతో దోహదపడుతుంది.

దరఖాస్తు చేసుకోవడానికి అర్హతలు

ప్రభుత్వ, పురపాలక, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3,50,000 మించకూడదు. పాఠశాలలో రెగ్యులర్ విధానంలో చదువుతుండాలి. రాత పరీక్షల ద్వారా స్కాలర్‌షిప్ పొందడానికి విద్యార్థులను ఎంపిక చేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి ఓసీ, బీసీ విద్యార్థులైతే పరీక్షల రుసుము రూ.100 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే పరీక్ష రుసుం రూ.50 చెల్లించాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 17వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. పరీక్షా రుసుంను ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింకు ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంది. దరఖాస్తులను ప్రభుత్వ వెబ్ సైట్ www.bre.ap.gov.in నందు నమోదు చేసుకోవచ్చును. దరఖాస్తు చేసే సమయంలో విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న విధంగానే విద్యార్థి పేరు, పుట్టిన తేది, తండ్రి పేర్లను నమోదు చేయాల్సి ఉంది.

సద్వినియోగం చేసుకోండి:



నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ ద్వారా ఉపకార వేతనాలను పొందడానికి మంచి అవకాశం. 8వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షల్లో ప్రతిభ చాటితే నాలుగేళ్లు పాటు ఉపకార వేతనం అందిస్తారు. చదువుకు ఆటంకం కల్గించే ఆర్థిక పరమైన ఇబ్బందుల్లో ఈ ఉపకార వేతనం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– దేవిరెడ్డి రామిరెడ్డి, జిల్లా ఎంఈఓల సంఘం అధ్యక్షుడు

మా వంతు ప్రోత్సాహం కల్పిస్తున్నాం:



మరో ఉపాధ్యయుడు బాపత్తు కోటిరెడ్డితో కలిసి ఐదేళ్ల నుంచి పరీక్షలు రాసే విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. పరీక్షలకు వారం రోజులు ముందు నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికి ఉచితంగా కోచింగ్ ఇస్తాం. ఆయా సబ్జెక్టులపై స్టడీ అవర్స్ నిర్వహించి సాధన చేయిస్తాం. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాతల, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. గత ఏడాది నియోజకవర్గంలో 40 మంది స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. అందులో కనిగిరికి చెందిన వారే 20 మంది ఉన్నారు.

– జంగా మధుసూదన్ రావు, సోషల్ టీచర్, శిక్షకుడు, కొత్త ఏరువారిపల్లి

ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసిన డీసీహెచ్



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ శేషుకుమార్

కనిగిరి రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల, సిబ్బంది కొరతను, సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ జిల్లా వైద్యశాల కోఆర్డినేటర్ శేషుకుమార్‌ కు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీకి వచ్చిన డీసీహెచ్‌ను మంగళవారం చైర్మన్ గఫార్ కలిసి పలు సమస్యలను విన్నవించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చాలా కాలం నుంచి ఇన్‌పెషేంట్స్ డైట్ ఇవ్వడం లేదని, వైద్యుల, సిబ్బంది కొరత వేధిస్తోందని విన్నవించారు. వెనుకబడిన కనిగిరి ప్రాంతంలో వైద్యశాలకు తగిన సౌకర్యాలు, వసతులు కల్పించాలన్నారు. కనిగిరి ఏరియాల్లో ప్రభుత్వ వైద్యశాలకు పేద ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతుందని, వైద్యుల నియామకానికి దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యుల కొరతతో కనిగిరి ప్రాంతంలోని పేదలకు మెరుగైన, తక్షణ వైద్యం కోసం పడుతున్న ఇబ్బందులను చైర్మన్ గఫార్ వివరించారు. కార్యక్రమంలో చీమకూర్తి ఆస్పత్రి సూపరిండెంట్ వేణుగోపాల్ రెడ్డి, వైద్యులు వెంకట సుబ్బయ్య, చంద్రష్, కిరణ్మయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. తొలుత ప్రభుత్వ వైద్యశాలను జిల్లా ఇన్‌చార్జి డీసీహెచ్ శేషుకుమార్ తనిఖీ చేశారు. వైద్యశాలతో ఓపీ విభాగం, వైద్య పరీక్షల విభాగాన్ని పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. అనంతర వైద్యులతో సమీక్షించారు. వైద్యుల కొరత, ఆపరేషన్లు జరుగుతున్నాయా లేదా.. తక్షణం వైద్యశాలలో చేపట్టాల్సిన చర్యలు, తదితర అంశాలపై చర్చించారు.

నల్ల రిబ్బన్లతో వైద్యుల నిరసన



నల్ల రిబ్బన్‌తో విధులకు హాజరైన పీహెచ్‌సీ డాక్టర్లు

పొన్నలూరు: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీహెచ్‌సీ డాక్టర్ రవికిరణ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ-85కు వ్యతిరేకంగా మంగళవారం పీహెచ్‌సీ డాక్టర్లు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్లు రవికిరణ్, కృష్ణచైతన్య, ఉమేరా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ 85తో తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందన్నారు. ఇలా జీఓను మార్చడం వల్ల తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. అలాగే ఈ జీఓ ద్వారా పీజీ అవకాశాలు తగ్గి గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు సేవలందించకుండా ప్రభావితం చేస్తుందన్నారు. వెంటనే ప్రభుత్వం జీఓను రద్దు చేయకపోతే సమ్మెను కొనసాగిస్తామన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.358



టంగుటూరులో పొగాకు వేలం

కొండపి (సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో అత్యధిక ధర రూ.358 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. అక్కచెరువుపాలెం, గోగినేనివారిపాలెం, పైడిపాడు గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 1392 బేళ్లను తీసుకురాగా 1302 బేళ్లను కొనుగోలు చేసి 90 బేళ్లను తిరస్కరించారు. సరాసరి ధర రూ.313.43గా నమోదైంది. వేలంలో 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం దావగుడూరు, చింతలపాలెం గ్రామాలకు చెందిన రైతులు 937 బేళ్లను తీసుకువచ్చారు. వాటిలో వ్యాపారులు 789 బేళ్లను కొనుగోలు చేసి 148 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.195, సరాసరి రూ.315.56గా నమోదైంది. వేలంలో 46 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి



జంపని రమణయ్య

పీసీపల్లి: మండల పరిధిలోని పెదవరిమడుగుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జంపని రమణారెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. రమణారెడ్డి కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. మంగళవారం ఆకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణించడంతో ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆత్మహత్య వద్దు..జీవితమే ముద్దు



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని.. వాటిని ఎదుర్కొని జీవించడమే మానవుని కర్తవ్యం, జీవితం అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. ఈదా ఇంటర్నేషనల్, సమగ్ర శిక్షణా, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ప్రపంచ ఆత్మ హత్యల నివారణ దినోత్సవం సందర్భంగా హెచ్ఎం కలువ విజయ లక్ష్మీ అధ్యక్షతన అవగాహన కల్పించారు. కష్టాలు, సమస్యలు ఎదరైనప్పుడు ఆత్మ విశ్వాసంతో పోరాడి విజయ సాధించాలన్నారు. ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి మాట్లాడుతూ సమస్యలతో, వత్తిళ్లలో ఉన్నప్పుడు స్నేహితులతో, కుటుంబసభ్యులతో చర్చించాలన్నారు. ఆత్మహత్య ఆలోచనలను సకాలంలో గుర్తించి కౌన్సెలింగ్ చేయిస్తే వాటి బారి నుంచి రక్షణ పొందగల్గుతారని వివరించారు. ఎంఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.వెంకటరెడ్డి, స్వచ్ఛంద సంస్థల సభ్యులు రాజేష్, మంద్రు రమేష్, నవకుమార్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండపి (సింగరాయకొండ): సంభాషణతోనే ఆత్మహత్య నివారించవచ్చునని స్పందన ఫౌండేషన్ శిక్షకురాలు వై శ్రీవేణి అన్నారు. ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. విలువైన జీవితాన్ని కోల్పోకుండా ఎలా బతకాలి అనే విషయాన్ని పిల్లలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.సూసన్నకుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి తోలకం విషయంలో ఘర్షణ

- ఇద్దరిపై కేసు నమోదు



స్టేషన్‌లో ఫిర్యాదుచేయడానికి వచ్చిన సర్పంచ్, ఆమె కుమారుడు

పామూరు: కుంట మట్టిని తోలకం విషయంలో బాబాయి, అబ్బాయిలు ఘర్షణ పడ్డారు. ఘర్షణలో ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అయ్యన్నకోట సమీపంలోని యర్ర కుంటలో మట్టిని జాతీయరహదారి బ్రిడ్జిగుంటలకు పూడ్చివేతకు తోలుకునేందుకు జాతీయరహదారి నిర్వాహకులు గ్రామస్తులతో మాట్లాడుకున్నారు. కాగా మంగళవారం ఉదయం మట్టిని తోలుకునేందుకు జేసీబి, టిప్పర్లు కుంటలో మట్టిని తీస్తున్నాయి. ఈ సందర్భంలో సర్పంచ్ కుమారుడు తుమ్మా పిచ్చిరెడ్డి ఎవరిని అడిగి మట్టితోడుతున్నారని వారిని ప్రశ్నించాడు. దీనికి వారు తుమ్మా ఆంజనేయరెడ్డి మట్టి తోలుకోమన్నాడని చెప్పారు. సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా మట్టి తోలుకోవడం ఏంటని సర్పంచ్ కుమారుడు తిరుపతిరెడ్డి ప్రశ్నించాడు. ఇంతలో అక్కడికి చేరుకున్న ఆంజనేయరెడ్డి తానే మట్టి తోలుకోమన్నానని, దానికి ప్రతిగా కట్ట బలోపేతానికి మట్టిపోస్తారని చెప్పగా..ఆ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకొని ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అనంతరం పోలీసులకు ఇద్దరూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం వెంకట రాజేష్ తెలిపారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం అందచేస్తున్న స్కూల్ కమిటీ చైర్మన్ పందిటి మోహన్, సభ్యులు

కనిగిరి రూరల్: స్థానిక మోడల్ స్కూలులో చదివే విద్యార్థులకు సాయంత్రం వేళ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని విద్యా కమిటీ చైర్మన్ పందిటి మోహన్, తల్లిదండ్రులు ఆర్టీసీ డిపో అధికారులకు వినతిపత్రం అందచేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పందిటి మోహన్‌తో కలిసి, విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఆర్టీసీ అధికారులను కలిశారు. ఈ సందర్భంగా పందిటి మోహన్ మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నందున సాయంత్రం సమయంలో పాఠశాలలోనే ఆలస్యమవుతుందన్నారు. దీంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుమారు 120 మంది విద్యార్థులు మోడల్ స్కూల్ చదువుతున్నారని, వారి సౌకర్యార్థం సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ఆంధ్ర శ్రీనివాసులు, తాతపూడి జాన్సన్, సురేష్, సత్యం పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పార్వతి

కనిగిరి రూరల్: పోషక విలువ కల్గిన ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని గురువాజీపేట పంచాయతీ బుడ్డాయిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పోషకాహార పదార్థాల గురించి వివరించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత వల్ల వచ్చే అనారోగ్య సమస్యల నివారణకు పోషకవిలువలు కల్గిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లతో అధిక పోషకాలు లభిస్తాయని తెలిపారు. తొలుత అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వృథాగా మోపాడు రిజర్వాయర్ నీరు



తూము ద్వారా వృథాగా పోతున్న మోపాడు రిజర్వాయర్ నీరు

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్ నీరు ప్రధాన కాల్వదారా వృథాగా పోతోంది. రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీరు సుమారు 5.5 అడుగుల వరకు ఉంది. చెరువులోని నీరు తూముల ద్వారా వృథాగా పోతోందని నీటిని ఉంచితే ఆయకట్టులోని జొన్న, ఇతర మెట్టపంటలకు ఆరుతడికింద నీరు ఉపయోగపడుతుందని తక్షణం నీటి వృథాను అరికట్టాలని రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని రైతులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ డీఈ బి.రవిని వివరణ కోరగా రిజర్వాయర్ ప్రధాన తూము షట్టర్ సరిగా లేదని, మరమ్మతులకు గురైగతంలోనూ నీరు పోయిందని తెలిపారు. తూము షట్టర్ ఏర్పాటుచేశామని, అయితే షట్టర్ సరిగా ఏర్పాటు కాకపోవడంతో నీరు లీకేజీ అవుతుందన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని, రెండు రోజుల్లో మరమ్మతులుచేసి లీకేజీని అరికడతామన్నారు. రిజర్వాయర్‌లో జెంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.14.67 లక్షలు



నగదు లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ప్రధాన హుండీ ఆదాయం రూ..14,67,749 వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ తెలిపారు. నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం దేవదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జీఏ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో ప్రధాన హుండీల ఆదాయం లెక్కింపు చేపట్టారు. మొత్తం రెండు నెలల 17 రోజులకు హుండీ లెక్కించినట్లు తెలిపారు. ప్రధాన హుండీల ద్వారా రూ.13,89,526, అన్నదానం హుండీల ద్వారా రూ.78,223 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, అర్చకులు మంకాల సత్యనారాయణ, మంకాల శివప్రసాద్‌శర్మ, పాలపర్తి నారాయణరావు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

● జై బోలో గణేష్ మహరాజ్‌కీ..



మర్రిపూడిలో గణనాథుని ఊరేగింపు

వినాయకచవితి వేడుకల్లో భాగంగా మంగళవారం గణనాథులను నిమజ్జనానికి తరలించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో గణనాథున్ని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత గులాములు చల్లుకుంటూ బాణ సంచా కాలుస్తూ నందడి చేశారు. మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానంఏర్పాటు చేశారు.

– మర్రిపూడి

ముసికి సాగర్ నీరు తక్షణమే విడుదల చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

కొండపి (సింగరాయకొండ): వర్షాలు లేక, వరి నారు వేసేందుకు అవకాశం లేక నీళ్ల కోసం ఎదురుచూస్తున్న ముసి ప్రాంత ప్రజలకు తక్షణమే సాగర్ నీరు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కొండపిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురిస్తే ఈ సమయానికి కొండపి, టంగుటూరు మండలాల్లో సుమారు 1500 ఎకరాల దాకా వరి నాట్లకు రైతులు సిద్ధం అయ్యే వారని అన్నారు. సహజ సిద్ధంగా ముసికొచ్చే నీరు రానందున వరి నాట్లకు రైతులు సిద్ధపడలేకపోతున్నారని తెలిపారు. ముసికి సాగర్ నీరు వదిలితే ముసి పరివాహక ప్రాంతంలోని నాలుగు మండలాల్లోని 46 గ్రామాలకు సాగునీరు, తాగునీరు లభించే అవకాశం ఉందని తెలిపారు. తాళ్లూరు మండలంలోని వెలుగువారిపాలెం, బొద్దికూరపాడు నుంచి చీమకుర్తి కొండపి, టంగుటూరు మండలాల్లో అనేక గ్రామాల ప్రజలకు ఈ నీరు ఉపయోగపడుతుందన్నారు. నిత్యం ఈ ప్రాంతంలో కరువు సంభవిస్తుందని దీనిని గమనంలో ఉంచుకొని ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన ముసికి ఐదు టీఎంసీల సాగర్ నీరు విడుదల చేసేలా చూడాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఒకవైపు శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు దాదాపు పూర్తిగా నిండిపోయాయని, వందల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో జలమయమై ఉండగా ఈ ప్రాంతంలో కనీసం తాగునీటికి కూడా ఇబ్బంది పడటం విచారకరమని అన్నారు. తక్షణమే జిల్లాకు చెందిన మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముసికి సాగర్ నీరు విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు కేజీ మస్తాన్ పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలి

కందుకూరు: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై. ఆనంద మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కోటారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలని ఈనెల 10వ తేదీన రాస్తోరోకు పిలుపునిచ్చామని తెలిపారు. రాస్తోరోకో చేస్తున్న ప్రతి ఏరియాలో పోలీసులు చొరబడి వారిని అరెస్టు చేయడం సరైందికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోరాటాలను అణదొక్కాలని చూడడం మంచిది కాదని, అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులను కాపాడతామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తరువాత అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం కాకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నత్తా రామారావు, కోటేశ్వరరావు, ఉప్పుటూరు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.